క్లుప్తంగా

పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి

మార్టూరు: ద్రోణాదుల పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి చేసిన ఘటనలో ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మద్దినేని శేషగిరిరావు శుక్రవారం రాత్రి తెలిపారు. సంక్రాంతి సందర్భంగా గురువారం రాత్రి ద్రోణాదుల గ్రామంలో తిరునాళ్ల జరిగాయి. తిరునాళ్లకు వచ్చిన జొన్న తాళికి చెందిన కొందరు యువకులు అర్ధరాత్రి ఒకటిన్నర గంటల ప్రాంతంలో తిరిగి స్వగ్రామం వెళుతూ గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి పెట్రోలు కొట్టమని సిబ్బందిని అడిగారు. పెట్రోల్ బంకు సిబ్బంది నరసింహారావు, సాంబయ్య.. ఆ యువకులతో బంకు మూసివేసి పడుకున్నామని పెట్రోలు కొట్టలేమన్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య వాదన ప్రారంభమై జరిగిన ఘర్షణలో సిబ్బంది నరసింహారావు చెవి, చెంపపై గాయాలయ్యాయి. అడ్డుకోవటానికి ప్రయత్నించిన పెట్రోల్ బంక్ సూపర్‌వైజర్ పెంట్యాల నాగేశ్వరరావు, స్థానికుడైన ముప్పరాజు ఉదయభాస్కర్లను కూడా యువకులు కొట్టి గాయపరిచారు. శుక్రవారం రాత్రి పెంటేల నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై జొన్న తాళి గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషగిరి రావు తెలిపారు.

పన్ను 100 శాతం వసూలు చేయండి

చీరాల టౌన్: గ్రామాల్లో పెండింగ్ బకాయిలు, ఇంటి పన్నులను మార్చి నెలాఖరులోపు 100 శాతం వసూలు చేయాలని ఈవోఆర్డీ రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో శనివారం ఈవోఆర్డీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. గ్రామాల వారీగా ఇంటి పన్నుల బకాయిలు పేరుకుపోవడంతో అభివృద్ధికి అడ్డంకిగా మారిందన్నారు. గ్రామాలన్నీ సుందరంగా ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేసి గ్రామాలను రోగాల నుంచి కాపాడాలన్నారు. పంచాయతీలకు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి రోజువారీగా పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చేయాలన్నారు. గ్రామాల్లో చెత్తకుప్పలు లేకుండా చూడాలని కోరారు. ప్రతి పంచాయతీకి విధిగా ఫాగింగ్ యంత్రం వినియోగించి దోమల నిర్మూలన చర్యలు చేపట్టారు. గ్రామాల అభివృద్ధికి కార్యదర్శులు శ్రద్ధగా పనిచేయాలన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులు వద్దు



ఆటోలో ప్రయాణించే వారికి అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట్రావు

కారంచేడు: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటోల్లో ప్రయాణించే వారు తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ వి. వెంకట్రావు అన్నారు. శనివారం మండలంలోని స్వర్ణ–కారంచేడు, కుంకలమర్రు–కారంచేడు రహదారుల్లో తిరిగే ఆటో వాలాలకు ప్రయాణాలపై అవగాహన కల్పించారు. మితిమీరిన వేగంతో వెళ్లే వాహనాలు ఎక్కవద్దన్నారు.

క్షణక్షణం భయం..భయం

- ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఈపురుపాలెం గాంధీ పార్క్ సెంటర్‌లో ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

చీరాల టౌన్: విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్‌ను అందిస్తున్నామని చెబుతున్న అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం సిమెంట్ దిమ్మెలు ధ్వంసమై ప్రమాదభరితంగా మారుతున్నాయి. మండల పరిధిలోని పలు గ్రామాలతో పాటు చీరాల పట్టణంలో చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న సిమెంట్ దిమ్మెలు ధ్వంసమయ్యాయి. అంతేగాక జనావాసాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఈ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయాలు లేకపోవటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గవినివారిపాలెంలోని పంట పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పిట్టువారిపాలెం మలుపు వద్ద జనావాసాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యార్థులు, గ్రామస్తులు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామకృష్ణాపురం పంచాయతీలోని గుంట మార్కెట్ ఎదురు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు కిందకు ఉండడంతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ నుంచి సరఫరా అందించే విద్యుత్ తీగలు బోర్డు నుంచి బయటకు వేల్లాడుతుండటంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ సరఫరా అప్ అండ్ డౌన్ అవుతూ తరచూ నిప్పు రవ్వలు ఎగిసిపడుతుంటాయి. అందుకే చుట్టూ ఫెన్సింగ్‌లను ఏర్పాటు చేస్తుంటారు. కానీ అవి ధ్వంసమై ప్రమాదభరితంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అలానే మండలంలోని ఈపూరుపాలెం గాంధీపార్కు సమీపంలో, రామాలయం సమీపంలో, పద్మనాభునిపేట, సీతారాంపేటలతో పాటు తోటవారిపాలెం ప్రధాన సెంటర్, కొత్తపాలెం, దేవాంగపురి పంచాయతీ కార్యాలయానికి కొద్ది దూరంలో ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రధాన రహదారుల పక్కన ఏర్పాటుచేసి ఉన్న చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ వలయాలు దెబ్బతిన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని, వెంటనే రక్షణ వలయాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పిట్టువారిపాలెంలో ప్రధాన రహదారిలో..

దశలవారీగా మరమ్మతులు చేయిస్తాం

రూరల్ గ్రామాల్లో , జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో దెబ్బతిన్న వాటిని గుర్తించాం . వాటికి మరమ్మతులు చేయిస్తాం. స్కూళ్లు, పంట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ చర్యలు తీసుకుంటాం. దశలవారీగా దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయిస్తాం.

– బ్రహ్మం, విద్యుత్ శాఖ రూరల్ ఏఈ, చీరాల

కుష్టు వ్యాధి నిర్మూలనే ధ్యేయం

స్వర్ణ (కారంచేడు): జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాల్లో భాగంగా కేసులు నమోదు కాకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీపీఎంఓ ప్రదీప్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు ఒక్క రోజు లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు చర్మం, చెవులు, వీపుపై ఎర్రని నొప్పిలేని బొబ్బలు, కనురెప్పలపై వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూత పడకపోవడం, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు కలిగి ఉండటం వంటి వ్యాధి లక్షణాలను గుర్తించి, వారికి అవసరమైన వైద్యం అందించాలన్నారు.



స్వర్ణ పీహెచ్‌సీలో శిక్షణ ఇస్తున్న డీపీఎంఓ ప్రదీప్‌కుమార్

ఉన్నతాధికారులు సమకూర్చిన పాంప్లెట్లను అందించారు. డాక్టర్ శాలిని, ఎహెచ్ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురి సిఫోరా, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోరం లేకుండానే సర్వసభ్య సమావేశం

జె.పంగులూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. నలుగురు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరు కాగా, కోరం లేకుండానే సమావేశం జరిగింది. మండలంలో మొత్తం 13 మంది ఎంపీటీసీలు ఉండగా, వారిలో బూదవాడ ఎంపీటీసీ (ఎంపీపీ) తేళ్ళ నాగమ్మ, కల్లవారపాలెం ఎంపీటీసీ (మండల ఉపాధ్యక్షుడు) యర్రం శ్రీనివాసరెడ్డి, కోటపాడు ఎంపీటీసీ తాటిపర్తి సామ్రాజ్యం, కొండమూరు ఎంపీటీసీ గుర్రం కళ్యాణిలు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన తొమ్మిది మంది ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. వచ్చిన నలుగురితోనే సమావేశం నిర్వహించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కె. స్వరూప రాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ రాయిణి ప్రమీల, ఈఓఆర్డీ సమంత్, పంచాయతీ రాజ్ ఏఈ గడ్డం హనుమంతురావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, ఐసీడీఎస్ పీడీ కృష్ణకుమారి మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపరాణి

సమన్వయంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

పర్చూరు(చినగంజాం): అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ మేకా ఆనందకుమారి అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం మండల పరిధిలోని వివిధ శాఖల గురించి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎస్. రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని మద్దతు ధరకంటే తక్కువ ధరకు అమ్ముకోవద్దని, వ్యవసాయ శాఖ, ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో చెరుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 104 వైద్యాధికారి ఏకాంబరేశ్వరరావు మాట్లాడుతూ 35 నుంచి 40 ఏళ్ల లోపు వారు క్రమం తప్పకుండా బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని తెలిపారు. ఈఓపీఆర్డీ కె. సత్యనారాయణ మాట్లాడుతూ చెత్త నిర్వాహణకు గతంలో నిర్మించిన తాటాకుల చెత్త షెడ్డు పనిచేయడం లేదని వాటి స్థానంలో రేకుల షెడ్డు నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో 90 శాతం అభివృద్ధి పనులు ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా జరుగుతున్నాయని 30 మంది సభ్యులు కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడి పనులు చేయడం ద్వారా నిధులు ఎక్కువగా వస్తాయన్నారు. ఎంఈఓ వెంకట్రామయ్య మాట్లాడుతూ పాఠశాల విలీనానికి సంబంధించిన 117 జీఓ రద్దయిందని తెలిపారు. యూపీ పాఠశాలల్లో 60 మంది నమోదు దాటిన పాఠశాలలను హైస్కూల్‌గా అప్ గ్రేడ్ చేస్తారని తెలిపారు. పార్టీ ముఖ్యులు



పర్చూరు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేకా ఆనందకుమారి

కొత్త చట్టాల గురించి తెలుసుకోవాలి

చీరాల రూరల్: జూనియర్ న్యాయవాదులు కొత్త న్యాయవాద క్రిమినల్ చట్టాలను ఆకళింపు చేసుకొని కక్షిదారులకు న్యాయ సహాయం అందించాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్. నిషాద్ నాజ్ సూచించారు. శనివారం స్థానిక కోర్టు బార్ అసోసియేషన్ హాలులో చీరాల బార్ అసోసియేషన్, ఐఏఎల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అడ్వకేట్ కమిషన్ అమలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జూనియర్ న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చెక్‌బౌన్స్ కేసులు, వారెంట్లు, సమన్లు అమలు చేయడం వంటివాటిపై న్యాయవాదుల వినతిపై అడ్వకేట్ కమిషనర్‌ను కోర్టు అపాయింట్ చేస్తుందని చెప్పారు. అయితే వివాదాస్పదంగా ఉన్న వాటిల్లో అడ్వకేట్ కమిషనర్ వాటిని అమలుచేసే సమయంలో పోలీసుల సహాయం తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. అడ్వకేట్ కమిషనర్ కోర్టు ఆదేశించిన పవర్‌తో సంఘటనా స్థలానికి వెళతాడని అడ్వకేట్ కమిషనర్‌ను ఎవరూ ఆటకాయించరాదని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో అడ్వకేట్ కమిషన్‌ను అమలు చేసే సమయంలో ఆ ప్రాంతానికి సంబంధించిన జిల్లా ఎస్పీ అనుమతిని అడ్వకేట్ కమిషనర్ తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. న్యాయమూర్తి చేతుల మీదుగా అధ్యక్షుడు రమేష్‌బాబు సహకారంతో ముద్రించిన కోర్టు డైరీలను న్యాయవాదులకు అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, ఐఏఎల్ జాతీయ కార్యదర్శి బూదరాజు శశికిరణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి మేరుగ రవికుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.



కోర్టు డైరీలను అందిస్తున్న న్యాయమూర్తి నిషాద్ నాజ్

భక్తిశ్రద్ధలతో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు



పంచరత్న సేవ నిర్వహిస్తున్న వాణీ కళానికేతన్ విద్యార్థులు

చీరాల అర్బన్: సంగీత సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను శనివారం ప్రారంభించారు. చైతన్య భారతి ఆధ్వర్యంలో ముంతావారిసెంటర్‌లోని ఎస్‌వీఎస్అండ్ఎస్‌జేఆర్ కళ్యాణ మండపం మేడపై ఐదు రోజులు పాటు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం త్యాగరాజస్వామి చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు. వాణీ కళానికేతన్ విద్యార్థులు, స్థానిక కళాకారులచే పంచరత్న సేవను నిర్వహించారు. డాక్టర్ సూర్యదేవర ఉమామోహన్, భాగి నారాయణశాస్త్రి పాల్గొన్నారు.

పేదలందరికీ కార్పొరేట్ వైద్యం



దుద్దుకూరులో వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని దుద్దుకూరు గ్రామంలో ఒంగోలు కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎస్ఆర్ఐ రాయిని సుబ్బరామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామంలోని పోలేరమ్మ గుడి ఆవరణలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో కంటి పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, గుండె, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు తగు జాగ్రత్తలను సూచించారు. మొత్తం 300 మందికి వైద్య చికిత్సలు నిర్వహించారు. రోగ నిర్ధారణ జరిగిన 70 మందికి ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు రావాల్సిందిగా సూచించారు. హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్, ఈసీహెచ్ఎస్,రైల్వే ఎఫ్‌సీఐ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఒక్కరికి కార్పొరేట్ వైద్యం అందిస్తామని హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫి తెలిపారు. వైద్యశిబిరం నందు డాక్టర్ రామాంజనేయులు, ఆప్తమాలజిస్ట్ రాణి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ప్రారంభం

చీరాల: మహిళా డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెలుగు మహిళా మార్ట్‌ను మరింత వృద్ధిలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం స్థానిక సురేష్ మహల్ ఎదురుగా గల పాత ఇ–సేవా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెలుగు మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఎంపీడీఓ శివసుబ్రహ్మణ్యం, బాపట్ల క్లస్టర్ కో–ఆర్డినేటర్ సుబ్బారావు పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయానికి కుర్చీల వితరణ

అద్దంకి: మండలంలోని నాగులపాడు సొసైటీ కార్యాలయానికి సొసైటీ చైర్మన్ మానికొండ నాగరాజు శనివారం 40 కుర్చీలను బహూకరించారు. చైర్మన్‌ను సీఐవో అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను అందరూ చేయాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ఇంకొల్లులో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు సిబ్బంది



స్వర్ణ గ్రామంలో వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ



మేదరమెట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పర్చూరు (చినగంజాం): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధి హామీ పీడీఎస్ విజయలక్ష్మి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన పర్చూరులో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛతా దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇందుకోసం గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు వారివారి పంచాయతీల్లో చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్వచ్ఛతను పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, డ్రైనేజీలు శుభ్రపరచుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్, ఈఓపీఆర్డీ కె. సత్యనారాయణ, ఏపీఓ బుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ఏ. మస్తాన్‌రావు, బి. నాగేశ్వరరావు, కోట శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల: గ్రామాన్ని ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రాజ్యలక్ష్మి అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో గల చెత్త శుద్ధి కేంద్రం వద్ద స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పంచాయతీ సిబ్బందితో ప్రతిజ్ఞన చేయించారు. ఈఓ లక్ష్మీకాంత్, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

కారంచేడు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ సిబ్బంది స్వచ్ఛతాహీ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ శాలినీ వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, చుట్టు పక్కలను కూడా అలాగే ఉంచాలన్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి జ్వరాలు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయన్నారు. హెచ్ఈఓ వి. నాగేశ్వరరావు, హెచ్ఈ మీనాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల అభివృద్ధి అధికారి జి. శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛతా దివస్ కార్యక్రమంలో భాగంగా ఇంకొల్లు బస్సు ప్రయాణ ప్రాంగణంలో మాట్లాడారు. . బస్టాండ్ పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డిని ఎంపీడీఓ ఆదేశించారు. అడ్డగడ వెంకటేశ్వర్లు, ఏపీఎం అనురాధ, సుబ్బులు, సచివాలయ సిబ్బంది శివశంకర్, వసుంధర, అపర్ణాదేవి, రజిని, లక్ష్మి, ఇంకొల్లు మండల ప్రయాణికులు సంఘం అధ్యక్షుడు అన్నంబొట్ల మోహనకృష్ణ, కంట్రోలర్ బాబు పాల్గొన్నారు.

యద్దనపూడి: పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ సూచించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీ కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పి. లక్ష్మినారాయణ, తహసీరవికుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

బల్లికురవ: స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈవోఆర్డీ దాసరి సుమతి శనివారం పిలుపునిచ్చారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, సెక్రటరీ కేవీ అనిల్ కుమార్, సచివాలయ పాల్గొన్నారు.

చీరాల: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యంపై ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ ర్యాలీలో మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



యద్దనపూడి: పీహెచ్‌సీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్ఓ, వైద్యసిబ్బంది



వల్లాపల్లిలో కార్యక్రమాలు చేపడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సాయిబాబాకు పుష్పయాగం



సాయిబాబాకు నిర్వహించిన పుష్పయాగం

చీరాల అర్బన్: స్థానిక పాపరాజుతోటలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరం 34వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో భక్తులు పట్టణంలో నగరోత్సవం నిర్వహించారు. 180 రకాల ప్రసాదాలను స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

అలరించిన గాత్ర కచేరి

చీరాల అర్బన్: చైతన్యభారతి ఆధ్వర్యంలో శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవాలు ముంతావారి సెంటర్‌లోని ఎస్‌వీఎస్అండ్ఎస్‌జేఆర్ కళ్యాణమండపంలో ఘనంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి బెంగళూరుకు చెందిన కొమ్మాజోశ్యుల అలేఖ గాత్ర కచ్చేరి నిర్వహించారు. చైతన్యభారతి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సూర్యదేవర ఉమామోహన్, భాగి నారాయణశాస్త్రిలు పర్యవేక్షించారు.